క్లుప్తంగా

తాటమ్మ తల్లి, గరుడేశ్వర స్వామి ఆలయాల్లో విప్పర్తి పూజలు


బోడపాటివారిపాలెంలో తాటమ్మవారికి పూజలు చేస్తున్న వేణుగోపాలరావు

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి ఘన విజయం సాధించి, మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాలని కోరుతూ బోడపాటివారిపాలెం తాటమ్మవారి ఆలయం, పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, పార్టీ నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, బోడపాటి సాయిబాబు, యడ్లపల్లి ఏసుబాబు, దాసరి కాశీ, పెచ్చెట్టి రాంబాబు, కుడుపూడి రాము, ఎస్.రాజేంద్రప్రసాద్, అడ్డగళ్ల శ్రీను, విప్పర్తి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వనువులమ్మ జాతర

అంబాజీపేట: మాచవరం శివారు కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వనువులమ్మ జాతర మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అమ్మవారి ఊరేగింపులో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. తీన్‌మార్ డ్యాన్స్‌లు, గరగ నృత్యాలు, కోలాటం, బ్యాండు మేళాలుతో పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఉదయం మాచవరంలోని ఇటికాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద నుంచి పూజ ఘటాలను ప్రత్యేక పూజలు జరిపి ఆసాదులు శిరస్సును ధరించి జాతర నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లా ఆర్చరీలో జానకీరామ్ ప్రతిభ


జానకీరామ్

మామిడికుదురు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు పిఠాపురం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం జరిగాయి. ఈ పోటీల్లో మామిడికుదురు మండలం మాకనపాలానికి చెందిన గెద్దాడ జానకీరామ్ జిల్లా స్థాయి మెన్స్ పోటీల్లో ఇంటియన్ రౌండ్స్ కేటగిరీలో మూడో స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ గెలుపొందాడు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన జానకీరామ్‌ను ఉమ్మడి జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ, కోచ్‌లు చిట్టూరి చంద్రశేఖర్, బొంతు మధుకుమార్, ఆర్చరీ సంఘం కార్యదర్శి పి.లక్ష్మణ సోమవారం అభినందించారు.

వైభవంగా నూకాలమ్మ జాతర

మామిడికుదురు: గ్రామ దేవత నూకాలమ్మ జాతర ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, తీన్‌మార్ విన్యాసాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర కనుల పండువలా జరిగింది. వేలాది మంది భక్తులు జాతరలో పాల్గొన్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాల కాంతులు, పలు రకాల బెంగళూరు పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలు చెల్లించారు. శుక్రవారం వరకు అమ్మవారి జాతర జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. జాతర మహోత్సవం సందర్భంగా ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

దింపు, ఒలుపు కార్మికుల సమస్యలకు కృషి

అంబాజీపేట: ఆరుగాలం కష్టించే కొబ్బరి దింపు, వలుపు కార్మికుల సమస్యలకు తన వంతు కృషి చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు అన్నారు. ముక్కామలలో కొబ్బరి దింపు, వలుపు కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు 50 ఏళ్లకు పింఛన్, ఇన్సూరెన్స్, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు విరివిగా ఏర్పాటు చేయించడం, కొబ్బరి కాయలను రూ.15కు కొనుగోలు చేసేలా తదితర అంశాలపై పోరాటం చేస్తానన్నారు. సమావేశంలో గుబ్బల కృష్ణ, మల్లవరపు నాగరాజు, నాగాబత్తుల ప్రకాశం, గునిశెట్టి వెంకటరత్నం, జోగి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి రూ.10 వేల ఆర్థిక సాయం

మామిడికుదురు: అనారోగ్యంతో బాధపడుతున్న పాశర్లపూడిలంకకు చెందిన లూటుకుర్తి కీర్తన, ఉప్పాటి రమేష్‌లను ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, ఒక్కొక్కరికి రూ.5 వేలు వంతున ఇద్దరికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. రాజేష్ మాట్లాడుతూ వర్గీకరణ కోసం పోరాడుతూ జాతి అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ఆపదలో ఉన్న మాదిగలకు అండగా నిలవాలన్నదే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్, తేజ, భాను, కార్తీక్, ధీరజ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో చరిత్ర సృష్టించిన జగన్


కత్తులవారిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

వైఎస్సార్ సీపీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి

పి.గన్నవరం: దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ చరిత్ర సృష్టించిన జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించాలని పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పి.గన్నవరంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని, ఆయన అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను విప్పర్తి వివరించారు. ప్రజా సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. తనతో పాటు, ఎంపీ అభ్యర్థి రాపాకకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. మోసపూరిత వాగ్దానాలతో వస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను నమ్మవద్దని అన్నారు. ఎన్నికల ప్రచారంలో విప్పర్తికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పలుచోట్ల ఆయనకు మహిళలు హారతులిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, ఎంపీటీసీ దాసరి మానిక, సొసైటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కడలి వెంకటరమణ, నాగాబత్తుల యువరాజు, యడ్లపల్లి మూలాస్వామి, దూనబోయిన రవిచంద్ర, కొక్కిరి రవికుమార్, అడ్డగళ్ల శ్రీను, పుచ్చకాయల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి


సఖినేటిపల్లి సినిమాహాల్ సెంటర్లో గొల్లపల్లిని సత్కరిస్తున్న స్థానికులు

సఖినేటిపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం రాత్రి సఖినేటిపల్లి లాకుపేటలో ఆయన అగ్నికుల క్షత్రియులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంక్షేమంలో దేశంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా సీఎం జగన్ తీర్చిదిద్దిన ఆంధ్రప్రదేశ్ ఖ్యాతి మరింత ఇనుమడింప చేసే విధంగా జగన్‌నే మరోసారి సీఎం చేసుకుందాం అని గొల్లపల్లి పిలుపునిచ్చారు. అలాగే అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి సీఎం జగన్ అమలు చేసిన పథకాలను వివరించారు. అలాగే సఖినేటిపల్లి కృపాపేటలో నాయకులు, యూత్ సభ్యులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్న అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. వీటితో పాటు సఖినేటిపల్లి సినిమాహాల్ సెంటర్లో నాయకులు, యూత్ సభ్యులతో ఆత్మీయ సమావేశం గొల్లపల్లి నిర్వహించారు. అభ్యర్థి గొల్లపల్లిని వారంతా ఘనంగా సత్కరించారు. సీఎం జగన్ వెంటే తామంతా అంటూ వారు భరోసా ఇచ్చారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఎంపీటీసీ నల్లి రత్నకుమార్, నాయకులు నల్లి ప్రేమానందం, రాపాక సూరయ్య, నల్లి బాలరాజు, ఆరిపల్లి సత్యనారాయణ, కొల్లాబత్తుల కుమార్, ఈద రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తాం


తాటిపాకలో గొల్లపల్లిని కలసిన కూనవరం నాయకులు

రాజోలు: వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని కూనవరం గ్రామానికి చెందిన పలు సామాజిక సంఘాల నాయకులు, కార్యకర్తలు సోమవారం ముక్తకంఠంతో మద్దతు పలికారు. ఈ మేరకు కూనవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావును తాటిపాకలో మర్యాద పూర్వకంగా కలసి మద్దతు తెలిపారు. గొల్లపల్లి మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి గతంలో ఎన్నడూ జరగని రీతిలో సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు కావాలంటే మళ్లీ సీఎంగా జగన్‌ను విజయపథంలో నిలపాలన్నారు.

అంకితభావంతో సేవలందిస్తే గుర్తింపు


ఏపీపీ ఆనంద్‌ను సత్కరిస్తున్న రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు

రాజోలు: ఏ వృత్తిలోనైనా అంకితభావంతో సేవలు అందిస్తే కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని రాజోలు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు అన్నారు. సోమవారం రాజోలు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఉత్తమ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అవార్డు అందుకున్న ఏపీపీ నల్లి ఆనంద్, రాజోలు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కోట సుధాకర్, మాజీ ప్రధాన కార్యదర్శి కొక్కెరగడ్డ శేషగిరిరావులను బార్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు, ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

ఘనంగా ముందస్తు ఉగాది సంబరాలు


మామిడికుదురులో జరిగిన ముందస్తు ఉగాది వేడుకలో పాల్గొన్న యువతులు

మామిడికుదురు: క్రోధి నామ సంవత్సరం ఉగాది సంబరాలను సోమవారం మామిడికుదురులో ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పరికిణీ, ఓణీ ధరించి యువతులు పచ్చని పంట పొలాల గట్లపై తిరుగుతూ సందడి చేశారు. తీపి, చేదు, పులుపు, ఉప్పు, కారం ఈ షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని అందిరికి పంచారు. డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పంచాగ శ్రవణంలో స్థానికులు పాల్గొన్నారు. ముందస్తు ఉగాది వేడుకలు ఆద్యంతం ఘనంగా జరిగాయి. ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగిన వేడులు ఆహుతులను రంజింప చేశాయి.

ఉగాదికి అమ్మవార్ల ఆలయాల ముస్తాబు


తాళ్లమ్మ అమ్మవారు

కొత్తపేట: ఉగాది సందర్భంగా మంగళవారం వివిధ గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. మండలంలోని పలివెల, స్థానిక కమ్మిరెడ్డిపాలెం గ్రామాల గ్రామ దేవతగా, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా విరాజిల్లుతున్న తాళ్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో జాతరలు, తీర్థం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. పలివెలలో మంగళవారం ఉదయం నుంచీ మొక్కులు తీర్చుకోగా రాత్రి జాతర, అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తారు. 10న తాటి చెట్లు కొట్టుకు వచ్చి ఉయ్యాల ఉత్సవం నిర్వహిస్తారు. 11న తీర్థం నిర్వహించనునున్నట్టు తెలిపారు. జాతర, తీర్థ మహోత్సవాల సందర్భంగా గ్రామస్తులతో పాటు ఉద్యోగ, ఉపాధి పేరిట స్థానికేతర ప్రాంతాల్లో ఉన్నవారు, వివాహాలతో అత్తవారిళ్లకు వెళ్లిన గ్రామ ఆడపడుచులు విధిగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని, నైవేద్యాలు సమర్పిస్తారు.

హ్యాట్రిక్ సృష్టించనున్న నరేంద్రమోదీ

కొత్తపేట: నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధాని పదవి చేపట్టి రికార్డు సృష్టించబోతున్నారని జాతీయ బీజేపీ నాయకుడు పురిగళ్ల రఘురామ్ అన్నారు. సోమవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ అయినవెల్లి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ పార్టీ జాతీయ నాయకుడు రఘురామ్, జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమాతో పాటు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పురిగళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ముస్లిం మైనార్టీలకు సీఎం జగన్ అండ


కొమరాడలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటున్నారని రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. కొమరాడలో ఎండీవై షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అభ్యర్థి గొలపల్లి సోమవారం రాత్రి పాల్గొన్నారు. గొల్లపల్లి మాట్లాడుతూ దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి సముచిత స్థానం కల్పిస్తే ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి అన్ని రంగాల్లో మైనార్టీలకు అండగా నిలుస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, అమలాపురం ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు షరీఫ్ ఆధ్వర్యంలో గొల్లపల్లిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, భూపతిరాజు సత్తిబాబురాజు, సూరిశెట్టి బాబి, యెరుబండి సూరిబాబు, వలవల పెదబాబు, బండారు కాశీ, మంగిన సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఐదు దశాబ్దాల తరువాత ఊడుగులమ్మ జాతర


ఊడుగులమ్మ

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో వేంచేసియున్న ఊడుగులమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక కాలనీకి వెళ్లే రోడ్డులో వేంచేసిన ఊడుగులమ్మ అమ్మవారికి 50 యేళ్ల క్రితం ఉత్సవాలను నిలిపివేశారు. అప్పటి నుంచి జీర్ణోద్ధరణ లేక మూసివేసి ఉన్న ఆలయానికి మళ్లీ పూర్వ వైభవం లభించింది, గ్రామానికి చెందిన అర్చక బ్రహ్మ అవార్డు గ్రహీత కాళ్లకూరి కాశీ శేఖర్‌బాబు నేతృత్వంలో గ్రామస్తులు సహకారంతో ఆలయాన్ని తెరచి రంగుల వేసి సర్వాంగ సుందరంగా తయారు చేశారు. ఈసందర్భంగా తీర్థత్సోవాల సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు, శక్తి వేషాలు, కాళీకామాత నృత్యాలు, సన్నాయి వాయిద్య మేళాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక నుంచి ఫాల్గుణ మాస అమావాస్య రోజున ఏటా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు.

నూకాంబిక తీర్థోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి తీర్థోత్సవాల్లో వివిధ ఏర్పాట్లను కొత్తపేట డీఎల్‌డీఓ టీఎస్‌వీ రాజేశ్వర రావు పరిశీలించారు. పారిశుద్యం పనులపై గ్రామ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వెంకటరెడ్డిని ఆరా తీశారు. తీర్థంలోని చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు బయటకు తరలించి తీర్థ పరిసరాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ప్రసాదాల విక్రయ దుకాణాన్ని సందర్శించి నాణ్యతను, పరిమాణాన్ని పరిశీలించారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అధికారులందరూ సమన్వయంతో పనిచేయాని సూచించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు, ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ, జేఏ డి.భాస్కర శ్రీనివాసు ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఆలయ లాంఛనలతో స్వాగతం పలికింది.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు


కొత్తపేటలో సెక్రటరీ రామన్‌కు రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు

కొత్తపేట: టీడీపీ, జనసేన పార్టీ అధినాయకుల అనుచిత, అవమానకర వ్యాఖ్యలు, ఆరోపణలు, ప్రజలకు నిరంతరం అందిస్తున్న సేవలకు ఆటంకం కలిగించడంతో గ్రామ వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేపట్టారు. మొదట అక్కడక్కడా పలు సచివాలయాల వలంటీర్లు రాజీనామాలు చేసి అధికారులకు సమర్పించగా రోజు రోజుకు వలంటీర్ల రాజీనామాల పర్వం జోరందుకుంది. నియోజకవర్గంలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లోని పలు సచివాలయాల వలంటీర్లు మూకుమ్మడిగా తమ రాజీనామాలను ఆయా ఎంపీడీఓలకు, గ్రామ కార్యదర్శులకు అందచేసి, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నియోజకవర్గంలో మొత్తం 87 సచివాలయాల పరిధిలో వలంటీర్లు కూడా రాజీనామాలు సమర్పించనున్నారు. దానిలో భాగంగా కొత్తపేట మండలంలో గంటి గ్రామానికి చెందిన 25 మంది ఇప్పటికే రాజీనామా చేయగా సోమవారం మందపల్లిలో 8 మంది వలంటీర్లు, కొత్తపేటలో 55 మంది, మోడేకుర్రులో 24 మంది, వానపల్లిలో 51 మంది తమ రాజీనామాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందచేశారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన తమపై టీడీపీ, జనసేన అధినాయకులు అవమానకర వ్యాఖ్యలతో మా మనసులు ఎంతగానో బాధపడ్డాయని వాపోయారు. ఈ ఎన్నికల నేపథ్యంలో మా సేవలకు అడ్డంకులు సృష్టించి, వలంటీర్ సేవలు నిలిపివేశారని దానితో స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నామని తెలిపారు. జరగనున్న ఎన్నికల్లో మా సత్తా చూపిస్తామని, ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని మళ్లీ గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు.

ఘనంగా అధ్యయనోత్సవాలు


ద్రవిడ పారాయణ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నాలుగో రోజు అధ్యయనోత్సవాలు కనులపండువగా నిర్వహించారు. చతుర్వేద పారాయణ, ద్రవిడ వేద పారాయణ, దివ్యప్రబంధనం, నీరాజన మంత్రపుష్పం, స్వామివార్ని గరుడ, సింహ, హంస వాహనాలపై గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. అనంతరం ఆళ్వారుల ప్రసాద వినియోగ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరం సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

'యింటి' వారి ఆత్మీయ సందడి


మామిడికుదురులో గవర్నర్ అవార్డు గ్రహీత హరి దుర్గాప్రసాద్‌కు సన్మానం

మామిడికుదురు: సుదూర ప్రాంతాల్లో ఉన్న ఒకే ఇంటి పేరు కలిగిన 'యింటి వారి ఆత్మీయ సందడి' సోమవారం మామిడికుదురులో ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా యింటి వారి ఇంటి పేరు కలిగిన 120 కుటుంబాలు ఒకే వేదికపై కలిసి ఆత్మీయతను పంచుకున్నాయి. ఈ కార్యక్రమానికి నాంది పలికిన ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి యింటి వెంకటనారాయణను ఘనంగా సత్కరించారు. జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఇటీవల అవార్డు అందుకున్న అల్లవరం మండలం తాడికోన వీఆర్వోగా పని చేస్తున్న మామిడికుదురుకు చెందిన యింటి హరిదుర్గాప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు. పేరూరు, నూజివీడు, ధవళేశ్వరం తదితర ప్రాంతాలకు చెందిన యింటి ఇంటి పేరు కలిగిన వారు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొని సందడి చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

రాజోలు: ఓటర్లంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని దివ్యాంగ ఓటర్ల జిల్లా స్వీప్ నోడల్ అధికారి బీవీ రమణ అన్నారు. సోమవారం రాజోలు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో విభిన్న ప్రతిభావంతులతో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. దివ్యాంగుల కోసం రూపొందించిన సాక్ష్యం యాప్‌ను వినియోగించుకోవాలని యాప్ ద్వారా దివ్యాంగుల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లవచ్చన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 85 శాతం ఓటింగ్ జరిగే విధంగా అన్ని వర్గాల ఓటర్లను చైతన్యం చేస్తున్నామన్నారు. దివ్యాంగుల ర్యాలీని తహసీల్దారు కె.గోపాలకృష్ణ ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.దుర్గారావు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీటికి కోడ్ వర్తించదా?


జగ్గన్నతోట వద్ద ముసుగు వేయకుండా దర్శనమిస్తున్న శిలాఫలకం

అంబాజీపేట: సార్వత్రిక ఎన్నికలకు నేపథ్యంలో రాజకీయ నాయకుల విగ్రహాలు, చిత్రపటాలు, శిలఫలకాలకు ముసుగు వేయాల్సి ఉండగా కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల అధికారుల ఆదేశాలను ధిక్కరించారు. ఇరుసుమండ, మొసలపల్లి శివారు జగ్గన్నతోట వద్ద, ఇరుసుమండ సెయింట్ జోసఫ్ స్కూల్‌కు వెళ్లే వంతెన వద్ద ఉన్న పంచాయతీరాజ్ శిలాఫలకాలు ప్రత్యక్షంగా దర్శనమిస్తున్న సంబంధిత అధికారులు వాటికి ముసుగు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు విమర్శిస్తున్నారు. వీటికి కోడ్ వర్తించదా...? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

అమ్మవార్లను దర్శించుకున్న గొల్లపల్లి

సఖినేటిపల్లి: మండలంలోని టేకిశెట్టిపాలెంలో కొలువైన బూరుగులమ్మ, పల్లాలమ్మ అమ్మవార్లను సోమవారం వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు దర్శించుకున్నారు. వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

చర్చిలో గొల్లపల్లి ప్రార్థనలు

సఖినేటిపల్లి: అంతర్వేదికర గ్రామంలోని సీజేసీఎం చర్చిలో సోమవారం వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ గొల్ల డేవిడ్‌రాజు ఆయనతో ఈ ప్రార్థనలు చేయించారు. చర్చి నిర్వాహకులు గొల్లపల్లిని ఘనంగా సత్కరించారు. దేవుని దయతో అందరి హృదయాల్లో శాంతి, ఆనందాలు నింపాలని ప్రభువును గొల్లపల్లి ప్రార్థించారు. గెడ్డం అమ్ములు, ఈద రవిరెడ్డి పాల్గొన్నారు.

పలువురికి గొల్లపల్లి పరామర్శ

మలికిపురం: మండలంలోని కత్తిమండ గ్రామ శాఖ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కర్రి వెంకట్రావు (55) ఇటీవల మృతి చెందారు. వెంకట్రావు కుటుంబ సభ్యుల్ని సోమవారం పార్టీ రాజోలు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ పెమ్మాడి సోమరాజు, ఎంపీటీసీ చిట్టాల శ్రీను, మంగిన సింహాద్రి ఉన్నారు.

హెచ్‌కానిస్టేబుల్ కుటుంబానికి..

సఖినేటిపల్లి: మండలంలోని మోరిలో సోమవారం రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ ఓగూరి విజయరత్నం కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. విజయరత్నం ఇటీవల మృతి చెందారు. వెంట కొల్లాబత్తుల కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థి నైతిక ప్రవర్తనపై ప్రచారం

మలికిపురం: రాజోలు జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాదరావు నైతిక ప్రవర్తనపై సమాధానం చెప్పాలంటూ సోషల్ మీడియాలో పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి. ఆయన కుటుంబ సభ్యులను నియోజకవర్గంలో ఎందుకు ఉంచలేదని ఆ పోస్టుల సారాంశం. అన్ని రాజకీయ పార్టీలు పార్టీలకు అతీతంగా వీటిని ఆలోచించాలని పోస్టుల్లో ఉంది.

ఈ పోస్టులకు దేవ సమాధానం చెప్పాలి

కూటమి అభ్యర్థి దేవ వర ప్రసాదరావు నైతికతపై సోషల్ మీడియాలో వస్తున్న పోస్టులకు, పంపిణీ జరుగుతున్న కరపత్రాలకు ఆయన సమాధానం చెప్పాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నల్లి డేవిడ్ డిమాండ్ చేశారు. సొంత నియోజకవర్గంలో నివాసం లేని ఆయన దిండి రైల్వే ప్రాజెక్టు ముందుకు సాగలేదని ప్రచారం చేయడం తగదని డేవిడ్ అన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు

పి.గన్నవరం: స్థానిక తాటమ్మ వారి ఆలయం సమీపంలో షేక్ ఖాజా (45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు పి.గన్నవరం బి.శివకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మద్యానికి బానిసగా మారిన ఖాజా స్థానిక చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. తాటమ్మ వారి ఆలయం సమీపంలోని భవనంలో పై అంతస్తులో కుటుంబంతో నివసిస్తున్నాడు. గత నెల 31 అతడు పనిచేస్తున్న చికెన్ షాపును మూసివేశారు. ఈనెల 4న కుటుంబ సభ్యులు ద్రాక్షారామలోని బంధువుల ఇంటికి వెళ్లడంతో ఖాజా ఒక్కడే ఇంటి వద్ద ఉన్నాడు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా ఇంటి నుంచి దుర్వాసన వస్తోంది. మంగళవారం స్థానికులు ఇంటిని పరిశీలించగా ఖాజా మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.